

కలుపు కష్టాలు

- పత్తి చేలల్లో పెరుగుతున్న గడ్డి మొక్కలు
- కూలీల కొరతతో ఇబ్బందులు
- ఎదగని మొక్కలతో సతమతం
- అన్నదాతకు భారమవుతున్న కలుపు ఖర్చు
- జిల్లాలో పత్తి సాగు లక్ష్యం 49,215 ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అన్నదాతలకు కలుపు కష్టాలు మొదలయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లాలో రైతులు హర్షం వ్యక్తం చేసినా పత్తి, మొక్క జొన్న పంటల్లో విపరీతమైన కలుపు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కూలీల కొరతతో రైతులకు కలుపు భారంగా మారింది. జిల్లాలో 49,215 ఎకరాల్లో పత్తిసాగు లక్ష్యంగా పెట్టుకోగా రైతులు ఇప్పటి వరకు 46,493 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. దీంతో పాటు మొక్కజొన్న 877 ఎకరాలు, కందులు 823 ఎకరాలు, పెసర 46 ఎకరాలు, ఇతర పంటలు 143 ఎకరాల్లో వేశారు. గడ్డిమందు నిషేధంతో పత్తి సాగులో కలుపు తీయడానికి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. గతంలో గడ్డి మందు ఎక్కువగా ఉపయోగించే వారు. గ్లైకోసెట్ వంటి మందులు జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని క్యాన్సర్ వంటి వాటికి దారి తీస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన మందులు కలుపును నివారించడానికి ఉపయోగపడడం లేదని రైతులు చెబుతున్నారు.

● కూలీల కొరతతో సతమతం

జిల్లాలో వానాకాలం పంటలకు కూలీల కొరత ఇబ్బందిగా మారింది. వర్షాలు ఆలస్యంగా మొదలవడం, కూలీలు లేకపోవడంతో వరి నాట్లు, పత్తి విత్తనాలు వేసుకోవడంలో ఆలస్యమైంది. వరినాట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. గంభీరావుపేటలో 19,535 ఎకరాలు, ఇల్లంతకుంట 39,987, సిరిసిల్ల 5417 ఎక రాలు, ముస్తాబాద్ 24,239, తంగళ్లపల్లి 22,270, ఎల్లారెడ్డిపేట 23,093, వీర్నపల్లి 8095, బోయినపల్లి 21,150, చందుర్తి 22,016, కోనరావుపేట 24,295, రుద్రంగి 10,857, వేములవాడ 7820, వేములవాడ రూరల్‌లో 14,340 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందులో 1.82 లక్షల ఎకరాలకు నాట్లు మొదలయ్యాయి. ఇప్పటి వరకు జిల్లాలో 50 వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. వరినాట్ల కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు రావడంతో ఊపందుకున్నాయి. జిల్లాకు బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వలసవచ్చారు. ఎకరానికి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు తీసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న చేలల్లో స్థానిక కూలీలు రూ.500 నుంచి రూ.600 వరకు కూలీ తీసుకుంటున్నారు. చేలల్లో ఎక్కువగా తుంగ, గరక, గడ్డిజాతి మొక్కలు పెరిగాయి.

కలుపు తీయడం కష్టంగా మారింది

- గుర్రం సుధాకర్‌రెడ్డి, ముస్కానిపేట



వర్షం రోజూ పడుతుండడంతో పత్తి చేలల్లో కలుపు పెరిగి మొక్కల ఎదుగుదలకు ఇబ్బందిగా మారింది. చేలల్లో బురద ఉండడంతో కలుపు తీయలేకపోతున్నాం. గడ్డి నివారణ మందులు నిషేధించడంతో కూలీలతో కలుపు తీయడమనేది అదనపు భారంగా మారింది. మరోవైపు కూలీలు కూడా దొరకడం లేదు.

ఎకరాకు రూ.4 వేలు అదనపు ఖర్చు

- ముక్క శంకర్, రైతు, రాజన్నపేట, ఎల్లారెడ్డిపేట



నాలుగెకరాలతో పాటు మరో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. పత్తి విత్తనాలు విత్తిన తర్వాత వాన పడక మొలకెత్త లేదు. మళ్లీ కొనుగోలు చేసి విత్తనాలను నాటిన. ఇప్పటికే పంట పెట్టుబడికి మొత్తం రూ.1.50 లక్షలు అప్పు చేశాం. వారం రోజులుగా కురుస్తున్న వానలకు పత్తి చేనుల్లో గడ్డి బాగా పెరిగింది. తొలగించేందుకు ఎకరానికి రూ.4 వేలు అదనంగా ఖర్చవుతోంది.

చెట్ల నరికివేతపై కలెక్టర్ ఆగ్రహం

వీర్నపల్లి, ఆగస్టు 2 : రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను నరకడంపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వీర్నపల్లి మండలం గర్జనపల్లి పర్యటనకు వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో రంగంపేటలో రోడ్డు పక్కన చెట్లను నరికి వేయడం చూసి కారు ఆపి అక్కడికి వెళ్లారు. పెరిగిన చెట్లను ఎందుకు నరుకుతున్నారంటూ అక్కడి వారిపై మండిపడ్డారు. విద్యుత్ లైన్లకు ఇబ్బంది అవడంతో పెరిగిన చెట్లను కొమ్మలను కొడుతున్నామని వారు తెలిపారు. చెట్లను నరికేందుకు మీకు ఎవరు పర్మిషన్ ఇచ్చారంటూ ప్రశ్నించారు. సంబంధిత అధికారులు ఎక్కడ అంటూ అడగడంతో వెంటనే అక్కడికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. పంచాయతీ కార్యదర్శిగా తాను శుక్రవారమే బాధ్యతలు తీసుకున్నానని విన్నవించారు. నరికివేసిన చెట్లకు బదులు పూల చెట్లను విద్యుత్ లైన్‌లకు దూరంగా పెట్టించాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కావద్దన్నారు. చెట్లను నరికి వేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

● రోడ్ల వెంట నాటిన చెట్లను నరికితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి రణధీర్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం బంజేరులో రోడ్ల వెంట నాటిన చెట్లను నరికిన తుడుం చందు, పర్లపల్లి నర్సయ్య, కత్తెరపాక నర్సయ్యకు రూ.1000 చొప్పున శుక్రవారం జరిమానా విధించారు.

అటవీ సంపదను కాపాడాలి

వీర్నపల్లి, ఆగస్టు 2 : అటవీ సంపదను కాపాడే బాధ్యత అందరిదని సిరిసిల్ల అటవీ క్షేత్రాధికారి కల్పన దేవి అన్నారు. వీర్నపల్లి మండలం భూక్యతండ పరిధిలోని రాశిగుట్ట తండాలో ప్లాంటేషన్ పనులను శుక్రవారం పరిశీలించారు. అడవులతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. అటవీ భూములను చదును చేసిన, చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ సెక్షన్ అధికారులు రంజిత్ కుమార్, సక్కారం, పద్మలత, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

టీఎస్‌ఆర్టీసీ గిఫ్ట్ స్కీం డ్రా



సిరిసిల్లలో డ్రా తీస్తున్న చిన్నారులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 : టీఎస్‌ఆర్టీసీ డీలక్స్‌లో ప్రయాణించిన మహిళలకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టగా డ్రాలో విజేతలైన ముగ్గురు మహిళా ప్రయాణికులను సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌రావు ప్రకటించారు. శుక్రవారం సిరిసిల్ల పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గిఫ్ట్ స్కీం డ్రా తీశారు. మొదటి బహుమతి లక్ష్మి, రెండో బహుమతి స్వరూప, మూడో బహుమతి కే స్వరూప సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల - వరంగల్, సిరిసిల్ల - కరీంనగర్‌లో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల కోసం గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఆర్టీసీ సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌చార్జి రామకృష్ణ, సేఫ్టీ వార్డెన్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ప్రభుత్వ సాయం : కలెక్టర్



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి కుటుంబ సభ్యులు

వీర్నపల్లి, ఆగస్టు 2: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి మెరుగైన వైద్యానికి ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో ఆరేళ్ల చిన్నారి నయనశ్రీ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక భారంతో మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తుండగా కలెక్టర్ అండగా నిలిచారు. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న కలెక్టర్ శుక్రవారం ఉదయం చిన్నారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులనడిగి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారికి వ్యాధి పూర్తిస్థాయిలో నయం కావడానికి కావలసిన వైద్య ఖర్చులను ప్రభుత్వం తరుపున అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారి తల్లి శ్యామల, తహసీల్దార్ పేరిట జాయింట్ అకౌంట్ తీసి వైద్య ఖర్చులకోసం తక్షణ సాయంగా రూ.10 లక్షలు బ్యాంకులో జమ చేశారు. చికిత్స కోసం కావాల్సిన నిధులను వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారికి పూర్తిస్థాయిలో నయం కావడానికి మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలనే పూర్తి నివేదికను సమర్పించాలని జిల్లా వైద్యాధికారి వసంతరావును ఆదేశించారు. చిన్నారి వైద్యం కోసం మరిన్ని నిధులు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, తల్లిదండ్రులు బెంగ పెట్టుకోవద్దని అన్నారు. చిన్నారి చికిత్స కోసం ఎలాంటి సాయం కావాలన్న తనను నేరుగా సంప్రదించాలని తల్లి శ్యామలకు ఆయన వ్యక్తిగత ఫోన్ నంబరు అందించారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్యాధికారి చిన్నారి నయనశ్రీ ఇంటికి చేరుకొని ఆసుపత్రి రిపోర్టులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

● కలెక్టర్ ఆదేశాలతో చిన్నారి నయనశ్రీ మెరుగైన వైద్య చికిత్స కోసం తల్లి శ్యామలకు రూ.10 లక్షల చెక్కును ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి అందజేశారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 2 : వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి మాట్లాడారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపట్టే కార్యక్రమాలతోపాటు చికున్‌గున్యా, డెంగ్యూ తదితర వ్యాధుల వ్యాప్తిపై అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని కేసులు నమోదవుతున్నాయని, నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియానా జడ్ చోంగ్తూ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. వ్యాధులు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలందరికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత్‌రావు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజుగోపాల్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వస్త్ర పరిశ్రమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 2 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం వస్త్ర పరిశ్రమల యజమానులు, ఆసాములతోపాటు కార్మిక సంఘాల నాయకులతో వస్త్ర పరిశ్రమల సంక్షోభంపై సమీక్ష సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలమేరకు ముందుకెళ్తామన్నారు. సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ హైకోర్టులో కేసు ఆర్‌ఈసీ ఆదేశాల మేరకు 10 హెచ్‌పీల వరకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామన్నారు. సమావేశంలో చేనేత జౌళీశాఖ ఏడి మిట్లకొల సాగర్, సెస్ ఎండి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతం

- 37మంది బాలలను రెస్క్యూచేసిన పోలీసులు
- 14 మంది యజమానులపై కేసులు
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 2: జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతమైందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ముగిసిన సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం ఏడాదిలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కృషి చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి స్వచ్ఛందసంస్థల భాగస్వామ్యంతో విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా 37మంది బాలలను రెస్క్యూ చేసి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామన్నారు. 18 సంవత్సరాల లోపు బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై 14కేసులు నమోదుచేశామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషిచేయాలన్నారు. బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వీధి బాలలను చూసినప్పుడు డయల్ 100 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి కృషి చేసిన కార్మికశాఖ, విద్యాశాఖ, బాలల సంరక్షణ సమితి, తదితర శాఖల అధికారులను ఎస్పీ అభినందించారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 2:వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం మహాలింగార్చన నిర్వహించారు. మాస శివ రాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి మహన్యాసక పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో మహా లింగార్చన చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిశీలిస్తున్న కీటక నియంత్రణ అధికారి రాజగోపాల్

వీర్నపల్లి, ఆగస్టు 2: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా కీటక నియంత్రణ అధికారి డాక్టర్ రాజగోపాల్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆరోగ్య ఉప కేంద్రం, కంచర్ల గ్రామంలో ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాల్ని శుక్రవారం పరిశీలించారు. డ్రై డే లో భాగంగా సిబ్బంది పనితీరును ఇంటింటా తిరిగి అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పరిసరాలను, టాయిలెట్స్‌ను పరిశీలించారు. పరిశుభ్రత సరిగా లేకపోవడంతో పని చేసే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎంలు రూతమ్మ, కీర్తి, సుజాత, ఆశావర్కర్లు ఉన్నారు.

సిరిసిల్ల ఇన్‌చార్జి కమిషనర్‌గా అలీ బేగ్



సిరిసిల్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్జా ఫసద్ అలీ బేగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మేనేజర్‌గా ఉన్న అలీబేగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతలు చేపట్టిన సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 2: సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్. వెంకటవీరస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సబ్ రిజిస్ట్రార్ పార్థసారధి కరీంనగర్ డీఐజీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా రిలీవ్ అయి వెళ్లారు. సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటవీరస్వామిని కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు. జిల్లాలోని వేములవాడ సబ్ రిజిస్ట్రార్‌గా ఎవరిని నియమించకుండా పోస్టింగ్ ఖాళీగా ఉంచారు.

జూకంటికి మరో జాతీయ పురస్కారం



మాట్లాడుతున్న అవార్డు కమిటీ కన్వీనర్లు

సిరిసిల్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏటా జాతీయ స్థాయిలో అందించే నాగుల మల్లయ్య స్మారక పురస్కారాన్ని సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి, రచయిత అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథంకు అందజేయనున్నట్లు అవార్డు కమిటీ కన్వీనర్లు ఎండీ సలీం, నాగుల సంతోష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం నాగులమల్లయ్య వర్ధంతి సందర్భంగా మాన్య ఫంక్షన్ హాల్‌లో పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కమిటీ చైర్మన్ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 2: విపత్తు నిర్వహణలో సేవలు అందించిన వ్యక్తులు సంస్థలు సుభాష్ చంద్రబోస్ అపద ప్రబంధన్‌పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వార్షిక జాతీయ విపత్తు పురస్కారానికి తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవార్డుల అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులతోపాటు అందించిన సేవల దృశ్యాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందితో జిల్లా వైద్యాధికారి వసంతరావు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని పీహెచ్‌సీతోపాటు ఆరోగ్య ఉప కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రికార్డులు, వైద్య సిబ్బంది, రోగులకు అందిస్తున్న సేవలు, పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి పల్లెల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించాలని, జ్వరపీడితులను గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించాలన్నారు. జాతీయ కీటక నియంత్రణ జిల్లా అధికారి రాజగోపాల్, ఇన్‌చార్జి వైద్యాధికారులు స్రవంతి, చిరంజీవి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు బాలచందర్, ఆంజనేయులు, పీహెచ్ఎన్ రజని, సూపర్‌వైజర్ పద్మ ఉన్నారు.

ఏడుగురిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: భర్త తరుపు కుటుంబీకులు అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. జమ్మికుంటకు చెందిన రమ్యకు హైదరాబాద్‌కు చెందిన కొల్లోజు శ్రీనివాసచారితో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకల కింద తమ పుట్టింటి వారు రూ.2.50లక్షల నగదు, పది తులాల భంగారు ఆభరణాలు ముట్ట చెప్పారు. వారికి ఒక కుమారుడు జన్మించాడు. కొంత కాలం తర్వాత అత్తింటి వారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భర్త శ్రీనివాసచారి, మామ ఆంద్రయ్య, అత్త సుశీల, బావ సత్యనారాయణ, తోటి కోడళ్ల మమత, నిత్య, మరిది దేవేందర్‌లు అదనపు వరకట్నం కోసం వేధించారని బాధితురాలు రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంభీరావుపేటలో దొంగతనం



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గంభీరావుపేట, ఆగస్టు 2 :మండల కేంద్రంలోని దుద్దెడి విజయ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీరువా పగుల గొట్టి రెండు తులాలన్నర బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఎత్తు కెళ్లారు. విజయ అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. ఇల్లు వీడాలని చెప్పడంతో విజయ కుటుంబం వేరే ఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతీ రోజు ఉదయం సొంతింటికి వచ్చి ఇంటి పనులు చేసి తిరిగి అద్దె ఇంటికి వెళ్తోంది. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉంది. బీరువా తెరిచి, వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పోలీస్‌లకు సమాచారం అందించడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై రాంమోహన్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ టీం బృందం ఇంటి పరిసరాలను పరిశీలించింది.


ఎస్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 2: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, జూన్, 2024లో (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) నిర్వహించిన 2, 4, 6వ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గొల్లపల్లి, ఆగస్టు 2: గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో గత నెల కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగిన బొలిశెట్టి ప్రభాకర్ (39) పదకొండు రోజుల అనంతరం పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 22న రాజు శ్రీనివాస్ అనే రైతు పొలంలో వరి నారు లాగేందుకు ప్రభాకర్ వెళ్లాడు. మధ్యాహ్నం వేళలో ఒడ్డు పై ఉన్న థమ్సప్ బాటిల్‌లో పొరపాటున కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగాడు. గమనించిన తోటి స్నేహితులు హుటాహుటిన వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేట్ వాహనంలో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుడి సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి అక్కడ రెండు రోజుల పాటు వైద్యచికిత్సలు చేయించారు. అయితే, అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. అయితే, పదకొండు రోజులు అనంతరం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, పాప, బాబు ఉన్నారు. మృతుడి తల్లి బొలిశెట్టి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గండాలు దాటనున్న గౌరవెల్లి


గౌరవెల్లి రిజర్వాయర్

● రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి కేబినెట్ ఆమోదం
● రూ.437 కోట్ల విడుదలకు నిర్ణయం ● 17 ఏళ్ల కల సాకారమవుతోందని రైతుల సంతోషం

హుస్నాబాద్, ఆగస్టు 2: మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ గండాలు ఇక తొలగిపోనున్నాయి. ఇక్కడి పొలాల్లో గోదావరి జలసవ్వడులను చూడాలనే ఈ ప్రాంత రైతాంగ నిరీక్షణ ఫలించబోతుంది. 17 ఏళ్ల క్రితం నుంచి ఈ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు రిజర్వాయర్ పనులు పూర్తయి నీటిని నింపే అవకాశం ఉన్నా వ్యవసాయ భూములకు నీరందించే కాలువలు లేక.. రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటూ వస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ గౌరవెల్లి రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి సవరించిన అంచనా ప్రతిపాదనల ప్రకారం రూ.437 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఇక గౌరవెల్లి రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతాయని రైతులు సంతోషపడుతున్నారు.

2007లో శంకుస్థాపన

వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగించే మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాలతో పాటు వరంగల్ జిల్లాలోని పలు గ్రామాలకు సాగు నీరందించాలని శ్రీరాంసాగర్ ఇందిరమ్మ వరదకాలువ గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హుస్నాబాద్‌లో శంకుస్థాపన చేశారు. ఒప్పందం ప్రకారం ఈ రిజర్వాయర్ల పనులు ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా రీ డిజైన్ ఇతర కారణాలతో 17 ఏళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ ఈ రిజర్వాయర్‌ను సందర్శించి దీనిని రీడిజైన్ చేశారు. 1.4 టీఎంసీలు ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్ ను 8.23 టీఎంసీలకు పెంచారు. దీంతో అదనంగా భూసేకరణ చేయాల్సి వచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా రి జర్వాయర్ ఎత్తుపెంచారని నిర్వాసితులు జాతీయ హరిత ట్రై బ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికీ కూడా ఎన్‌జీటీలో ఈ కేసు ఉంది.


రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు(ఫైల్)

పూర్తయిన ట్రయల్ రన్

8.23 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లోకి 2 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే 32 మెగావాట్ల సామర్థ్యం ఉన్న చైనా నుంచి వచ్చిన మూడు మోటార్లను బిగించారు. 2022 జూలై 31వ తేదీన అందులోని ఒక మోటార్‌తో 10 నిమిషాల పాటు ట్రయల్ రన్ నిర్వహించారు. మరో రెండు రోజుల అనంతరం అధికారులు రెండో మోటారు, మరో రెండు రోజులకు మూడో మోటారు ట్రయల్‌రన్ చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీటిని మిడ్‌మానేరు ద్వారా బెజ్జంకి మండలం తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి తీసుకవస్తారు. మొదటి డిజైన్ ప్రకారం రూ.409 కోట్లతో చేపట్టిన ఈ సొరంగం పనులు పూర్తయిన అనంతరం రీ డిజైన్‌లో భాగంగా అదనంగా మరో రూ.380 కోట్లతో పనులు చేశారు. తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో రేగొండ వద్ద గౌరవెల్లి రిజర్వాయర్ ఉంటుంది. ఇందులో 12 కిలోమీటర్ల మేర సొరంగం ఉంటుంది. 5.6 మీటర్ల టన్నెల్‌షిప్‌తో 32 క్యూబిక్‌తో నీటిని తీసుకెళ్లే విధంగా సొరంగం నిర్మించారు. 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల లోతుతో సర్జ్‌పూల్ (నీళ్ల సంపు), 61మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు, 130 మీటర్ల లోతుతో పంపుహౌజ్‌ను నిర్మాణం చేశారు. ట్రయల్ రన్‌తో రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని కూడా నింపారు.

1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు

గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయితే 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 48, 148 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ రిజర్వాయర్‌కు రెండు ప్రధాన కాలువలు ఉండగా కుడి కాలువ ద్వారా 90 వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 16వేల ఎకరాలు సాగవుతాయి.



రాబోయే సీజన్‌లో గౌరవెల్లి ద్వారా నీరందిస్తాం
: మంత్రి పొన్నం ప్రభాకర్

రాబోయే సీజన్‌లోపు గౌరవెల్లి ద్వారా సాగు నీరందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలువలకు సంబంధించి రూ.437 కోట్లు బడ్జెట్‌లో ఆమోదించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారని, అప్పుడే 80 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కుర్చీ వేసుకొని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి పదేళ్లయినా పట్టించుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులపై నిరంకుశత్వంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇక కాలువల నిర్మాణం వేగం చేస్తామని చెప్పారు.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేస్తున్నాం

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 2: రైతులకు త్వరగా వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 689 సర్వీసులను మంజూరు చేయగా, ఈ ఏడాది 937 సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 248 సర్వీసుల మంజూరు(36 శాతం) పెరిగిందని అన్నారు. సర్వీసుల మంజూరు మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు దరఖాస్తు ఎక్కడ పెండింగ్ ఉంది, ఎవరి దగ్గర పెండింగ్ ఉంది దానికి గల కారణాలను సవివరంగా అగ్రికల్చర్ పోర్టల్ (ఆన్‌లైన్)లో చూసుకునే వెసులు బాటు ఉందన్నారు. దీని ద్వారా మంజూరులో ఆలస్యం లేకుండా తొందరగా మంజూరు అవుతున్నాయని అన్నారు.

అలాగే ఈ- స్టోర్స్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని మెటీరియల్‌ను కావాల్సిన సమయంలో తీసుకొని పనులు ప్రారంభిం చవచ్చన్నారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, రైతులకు ఎంతో మేలు చేకురుతుందని చెప్పారు. అలాగే ఒక పనికి సంబంధించిన మెటీరి యల్ ఏమైనా మిగిలి ఉంటే వేరే పనికి పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకొనే వెసులు బాటు మొత్తం కూడా ఆన్‌లైన్‌లోనే చేశామని తెలిపారు. ఈ పద్ధతి వలన కూడా ఎంతగానో సమయం ఆదా అవుతుందని వివరించారు. ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచామని, వంగిన పోల్‌లు, లూస్ లైన్‌లను కూడా సరి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రైతులకు వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని వెనువెంటనే మంజూరు చేసేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు .

విష జ్వరంతో మహిళ మృతి


శ్రీలత (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన శనిగరపు శ్రీలత (35) విష జ్వరంతో గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల చెప్పిన వివరాల ప్రకారం.. శనిగరపు శ్రీలత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గపోవడంతో హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతిచెందింది. మృతురాలికి భర్త శ్రీనివాస్, ఇద్దరు కుమారులు హర్ష, సూర్య ఉన్నారు.

యువతిపై అత్యాచారయత్నం: కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2: కరీంనగర్‌లో కోతిరాంపూర్‌లో మంచిర్యాల జిల్లాకు చెందిన యువతి (20)పై రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన చింతం వంశీకృష్ణ(21) అత్యాచార యత్నం చేశాడని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న వంశీకృష్ణ కొద్దిరోజుల కిందట యువతితో పరిచయం పెంచుకుని గురువారం ఆమెను కరీంనగర్‌కు రావాలని కోరాడు. ఆమె కరీంనగర్‌కు వచ్చిన సమయంలో అత్యాచారయత్నం చేవాడని బాధితరాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిందితుడికి 8నెలల జైలు శిక్ష

హుజూరాబాద్, ఆగస్టు 2: ఓ మహిళ ఇంట్లోకి చొరబడి చంపుతానని బెదిరించిన వ్యక్తికి జడ్జి ఎనిమిది నెలల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. ఫిబ్రవరి 2, 2024న హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంటి పక్కనే ఉండే బుర్ర చక్రపాణి అకారణంగా ఆమె ఇంట్లోకి చొరబడి కత్తితో చంపుతానంటూ తల వెంట్రుకలు పట్టుకొని బెదిరించాడు. దీంతో మహిళ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి, కోర్టులో చార్జిషీటు వేశారు. కోర్టులో ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి శ్రీసాయిపద్మ నిందితుడికి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ.300జరిమానా విధించారు.

నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 2: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామ కమాన్ వద్ద సిద్దిపేటకు చెందిన వల్లెపు దేవదాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. అనంతగిరికి చెందిన గొల్లపల్లి రమేష్ ద్విచక్రవాహనం గురువారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా దేవదాస్‌ను పట్టుకున్నట్లు, అతడిపై సిద్దిపేటలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేడిపల్లి, ఆగస్టు 2: మేడిపల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న మ్యా కల శేఖర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన శేఖర్ వ్యక్తి కిరాణం నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. అత్యాశతో అధిక డబ్బు సంపాదించాలనే మోజులో పడి తక్కువ ధరకు గంజాయిని విక్రయించి ఎక్కువ ధరకు యువతకు విక్రయించాలని మేడిపల్లి, కొండాపూర్ పరిసరాల్లోని యుతనుకు గంజాయి అమ్మేందుకు వచ్చాడు. ఈ సమాచారం పోలీసులకు అందడంతో ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసి అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 565 కిలోగ్రాముల గంజాయి మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు, కోరుట్ల సీఐ సురేష్‌బా బు, ఎస్సై శ్యామ్‌రాజ్, సిబ్బంది దినేష్, అనిల్, చందు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్‌గౌడ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన యువకుడు లింగాల సురేశ్‌గౌడ్ (28) మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని సురేశ్‌గౌడ్ ఉపాధి నిమిత్తం కొలంగా మహారాష్ట్రకు వలస వెళ్తుండేవాడు. ఈ నెల 1న స్వగ్రామానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న క్రమంలో కింద పడిపోయి చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందడా..? లేక వాహనం ఢీకొనడంతో చనిపోయడా.. అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి తల్లి ఎల్లవ్వ, భార్య స్వాతి, కూతురు రితన్యా, అన్విత్ లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


స్రవంతి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కడుపునొప్పి భరించలేక సకినాల స్రవంతి(28) అనే వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన స్రవంతికి నారాయణపూర్‌కు చెందిన సకినాల దేవరాజుతో పదేళ్ల కిందట వివాహమైంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందట దేవరాజు ఉపాధి నిమిత్తం దుబాయి వలస వెళ్లాడు. కొంత కాలంగా స్రవంతి అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం రాత్రి తాను కడుపునొప్పికి తాళలేకపోతున్నానని తండ్రి శంకరయ్యకు ఫోన్ చేసి చెప్పింది. తండ్రి రాత్రి నారాయణపూర్ చేరుకొని అడుగ గా కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగానని తెలిపింది. దీంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

రామడుగు, ఆగస్టు 2: అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశరాజుపల్లిలో విషాదం నింపింది. ఎస్ఐ సురేందర్ కథనం ప్రకారం.. దేశ రాజుపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాజయ్య (53) గొర్లను మేపకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రాజయ్య గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: పాత పగలు మనసులో పెట్టుకుని తనతో పాటు భార్య, కుమారుడిపై ఓ కుటుంబం దాడి చేసిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీస్‌లు వారిపై కేసు నమోదు చేశారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రేవెల్లి సమ్మయ్య, భార్య కనకమ్మ, కుమారుడు రాజేష్‌లపై తిరుపతి, స్వరూప, ప్రకాష్, సింధు, అరవింద్ అనే వ్యక్తులు పాత పగలు మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితుడు సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 2: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఏడో రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 ఎస్‌ఆర్‌ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలిస్తున్నారు. నీటి ప్రవాహంతో వరదకాలువ ఉప్పొంగుతూ ప్రవహిస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వివిధ గ్రామాల ప్రజలు వరద కాలువ, గ్రావిటీ కాలువల నీటి ప్రవాహాన్ని తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12,600 క్యూ సెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 1890 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 311.080 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.018 టీఎంసీల మేర నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 9 గంటల వరకు ప్రాజెక్టులోకి ఎగు వ ప్రాంతం నుంచి 7924 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.554 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.



గాయత్రి పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీరు

పాడిపశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 2: పాడిపశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు రుణమాఫీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి పశువుల యూనిట్ల ఏర్పాటు అంశాలపై శుక్రవారం బ్యాంకర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మొదటి దశలో ఎంపిక చేసిన లబ్ధిదారులు ఆసక్తి చూపని పక్షంలో మిగిలిన దరఖాస్తుదారుల జాబితా నుంచి అర్హులను ఎంపిక చేసి యూనిట్ గ్రౌండ్ చేయాలని సూచించారు. రూ.2 లక్షల రుణ మాఫీలో భాగంగా ప్రభుత్వం రెండు విడుతల్లో రూ.లక్షన్నర వరకు నిధులు విడు దల చేసినట్లు చెప్పారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, బ్యాంక్ కంట్రోలర్స్, జడ్పీ సీఈవో గీత, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి



సిరిసిల్లలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఆ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మద్దతు ప్రకటించడం, రైతుల రుణమాఫీ రూ.లక్షా50 వేలపై కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణపై మొట్టమొదట స్పందించి రాష్ట్రంలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రెండో విడతగా రూ.లక్షా50వేల లోపు రుణాన్నిమాఫీ చేసి సీఎం చిత్తశుద్ధి చాటుకున్నారన్నారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, ఎంపీటీసీ బైరినేని రాము, పీసీసీ మాజీ కార్యదర్శి నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు వైద్య శివప్రసాద్, వెల్ముల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, వెంకటేశం, గుజ్జె రమేష్, మల్లేశం, ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రెండో విడత రుణమాఫీ చేసినందుకు కృతజ్ఞతగా తంగళ్లపల్లి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం ఆ పార్టీ అధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు పొన్నాల పర్శరాములు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, నాయకులు పూర్మాణి లింగారెడ్డి, నేరెళ్ల నర్సింగం గౌడ్, సత్తు శ్రీనివాసరెడ్డి పెద్దూరు తిరుపతి, బైరినేని రాము తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తామని చెప్పడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, తర్రె లింగం, మారంపెల్లి రాజ్‌కుమార్, దాస్, దాసరి గంగారాజం పాల్గొన్నారు.

నేతన్నలవి ఆత్మహత్యలు కాదు.. ప్రభుత్వ హత్యలే



సిరిసిల్లలో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 2: సిరిసిల్లలో ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అవి ప్రభుత్వం చేయించిన హత్యలేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఉపాధి కల్పిం చకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్,సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, జిల్లా అధ్యక్షుడు రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రవి, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువకు గండి పడినా పట్టించుకోరా?

వీర్నపల్లి, ఆగస్టు 2: వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో రామ లక్ష్మణ కుంటకు వచ్చే కాలువకు గండి పడినా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు మం డిపడ్డారు. ఏటా వర్షాలకు కాలువకు గండి పడితే రైతులు ఇసుక సంచులు వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 10 మంది రైతులు కలిసి శుక్రవారం కాలువ గండికి ఇసుక సంచులు, చెట్ల కొమ్మలను అడ్డు వేశారు. వర్షపు నీరు కుంటలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. రైతు రుణమాఫీతో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక శాసన సభలో మహిళా ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి అవమానపర్చేలా వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగడం సిగ్గు చేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడం సరికాదన్నారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, బాబు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెస్ ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 2: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని, వినియోగదారులకు విద్యుత్ సేవలను అందించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. సిరిసిల్ల పట్టణంలో సెస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం యశోద హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్‌లు సత్యసుధీష్, కళ్యాణ్, ప్రసాద్, అభిషేక్ 236 మందికి వైద్య పరీక్షలు చేశారు. యాశోద హాస్పిటల్ మేనేజర్ వినయ్‌కుమార్, వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు సమర్థించడం హర్షనీయం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు సమర్థించడం హర్షనీయమని కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వీట్లను పంపిణీ చేశారు. అంబేద్కర్ సంఘం సభ్యులు బడుగు లింగయ్య, కత్తెర రాజయ్య, బడుగు స్వామి, లింగంపల్లి అశోక్, బడుగు లక్ష్మణ్, నర్సయ్య పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుంకుమార్చన

సిరిసిల్ల రూరల్, అగస్టు 2 : సిరిసిల్ల పట్టణంలో హరిహరపుత్రఅయ్యప్ప స్వామి దేవాలయంలోని శుక్రవారం చేపట్టిన కోటి 8లక్షల కుంకుమార్చన కన్నుల పండువగా ప్రారంభమైంది. అయ్యప్ప స్వామి ఆలయంలోని రాజ శ్యామల, వారాహిసహిత లలితా త్రిపుర సుందరీ, అష్టలక్ష్మీ సహితలక్ష్మీ నారాయణ దేవాలయాల 3వ వార్షికోత్సవం సందర్భంగా అలయ కమిటీ అధ్యక్షుడు రాచ విద్యాసాగర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. 8 రోజులపాటు కోటి 8లక్షల కుంకుమార్చనకు ఏర్పాటుచేశారు. శుక్రవారం సుమారు 500 మంది మహిళలు పూజలు చేశారు.

రెండోరోజు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 2: కోర్టు ఆర్డర్‌లను, న్యాయవాదులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడమే కాకుండా సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణపై తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేయడాన్ని నిరసిస్తూ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజైన శుక్రవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. ఈనెల 5వరకు నిరవధికంగా విధులను బహిష్కరిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల లక్ష్మారెడ్డి తెలిపారు. వేములవాడలోనూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, ఉపాధ్యక్షులు దుర్గారెడ్డి, ట్రెజరర్ విష్ణు, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, కల్చరల్ సెక్రెటరీ గుడ్ల కిషన్, గ్రంథాలయం కార్యదర్శి శశాంకం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధిత రైతును పరామర్శించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖ అ ధికారులు అడ్డుకుంటున్నారనే మనస్తాపంతో గత నెల 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా లోని గిరిజన రైతు అజ్మీరా రాజును నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శుక్రవారం పరామర్శించారు. గిరిజనులకు ప్రభుత్వం అందించిన పట్టా భూము ల్లో సాగు చేసుకుంటే అధికారులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు నర్సింలు ఉన్నారు.

విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ముస్తాబాద్, ఆగస్టు 2 : విద్యుత్ చౌర్యం జరగకుండా చూడాలని సెస్ డీఈ మహేందర్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి ఆధ్వర్యంలో సెస్ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం జరగ కుండా చూడాలని బిల్లులు సకాలంలో వచ్చేలా చూడాలని ఆదేశించారు. వర్షాకాల నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్‌పై దృష్టి పెట్టి సరిచేయా లన్నారు. అసిస్టెంట్ అకౌంట్స్ ఇంజనీర్ వెంకటేశం, ఏఈలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, ఆగస్టు 2 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఆర్డీఏ పీడీ శేషాద్రి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండేలా సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో శ్రీనివాస్ మూర్తిని వైద్యాధికారి వేణుమాధవ్ సన్మానించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



క్షీరాభిషేకం చేస్తున్న ఎంఎస్పీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు సానుకుల తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు దుమాల, గొల్లపల్లి, రాజన్నపేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహిం చారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు నివాళులు అర్పించారు. నాయకులు లక్ష్మణ్, గోపాల్, చంద్రయ్య, బాబు, హనుమంతుబాబు, కృ ష్ణంరాజు, శామ్యుల్, చంద్రం, లింగం, దేవరాజు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ షెడ్యూల్ కులాల వర్గీకరణ తీర్పు నూతన చరిత్రకు నాందిపలుకుతోందని ఎంఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ థామస్ అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో శుక్రవారం ఎంఎస్పీ నాయకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ విజయం మాదిగ అమరవీరులకు, ఉద్యమంలో పోరాడిన పోరాట యోధులకు, ఉద్యమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు అంకితమన్నారు. నాయకులు మరాటి వెంకటి, జోగిని శంకర్, అక్కనపల్లి రాజు, సుంకపాక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : ఎమ్మార్పీఎస్ 30ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, మండల అధ్యక్షుడు కలకోట రవి అన్నారు. మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గుండ థామస్, ఖానాపూర్ లక్ష్మణ్, బొల్లె బాబు ఉన్నారు.

బోయినపల్లి: బోయినపల్లి మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దయ్యాల నారాయణ, చేప్యాల గణేష్, గంగారెడ్డి, మునిందర్, ఓద్యారపు ఆనంద్, దసారి గంగారాజం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో జిల్లా శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

చందుర్తి, ఆగస్టు2: చందుర్తి మండల కేంద్రంలో ఒకటో అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజం శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను, చిన్నారుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఐసీడీఎస్ అదనపు సీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్ రాజూరి భూజ్యోతి ఉన్నారు.

లింగన్నపేటలో యువకుడి ఆత్మహత్య

గంభీరావుపేట, ఆగస్ట్ 2: గంభీరావుపేట మండలం లింగ న్నపేటకు చెందిన పార్వతి మహేష్ (28) అప్పుల బాధతో శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్‌ల వివరాల ప్రకారం.. కుటుంబ పోషణలో భాగంగా మహేష్ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. మద్యానికి బానిస య్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

రుద్రంగి, ఆగస్టు 2: రుద్రంగి మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి వేములవాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కావేటి సుజన జరిమానా విధించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఐదుగురికి రూ.1000, ఒకరికి రూ. 2000 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై దాడి ఘటనలో ఒకరి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ఇంటి స్థలం విషయంలో వృద్ధు రాలు రాకం నర్సవ్వపై దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డి పేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బత్తుల రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమా కాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని నర్సవ్వకు ఆమె ఇంటి సమీపంలో ఉన్న బత్తుల రాజుతో ఇంటి స్థలం విష యంలో గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గత నెల 26న నర్సవ్వపై రాజు సుత్తేతో దాడి చేశారని పేర్కొన్నారు. బాధితురాలి కూతురు కాసర్ల సత్తవ్వ ఫిర్యాదు మేరకు బత్తుల రాజుపై కేసు నమోదు చేశామన్నారు.

సంక్షిప్తంగా..

ఎల్లారెడ్డిపేట : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండల రాచర్లబొప్పాపూర్‌లోని ఖలీద్‌కు చెంది న ఇల్లు గురువారం రాత్రి కూలిపోయింది. ఇల్లు ఉరుస్తుందని గమనించిన ఖలీద్ కుటుంబ సభ్యులు పక్క ఇంటిలో నిద్రించ డంతో ప్రమాదం తప్పినట్లయ్యింది.

వీర్నపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలం అడవిపదిర, లాల్ సింగ్ తండాలో ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో బోధించేం దుకు పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలన్నారు.

గంభీరావుపేట : ఎస్సీల వర్గీకరణ తీర్పును తాము వ్యతికే స్తున్నామని, ఈ తీర్పు దళితులపై కుట్రలో భాగమేనని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. గంభీ రావుపేటలో శుక్రవారం మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ తీర్పు బీజేపీకి అనుకూలంగా ఉందన్నారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు బాబు, జిల్లా కార్యదర్శులు ఉన్నారు.

వేములవాడ టౌన్ : వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఇస్లాంనగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు శుక్రవారం కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో షేక్ షౌరేమియా, షేక్ అలీ, అబ్దుల్ రహిమాన్, అబ్దుల్ అజీస్ ఉన్నారు.

● జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా వేములవాడ పట్టణానికి చెందిన డాక్టర్ రాపెల్లి శ్రీధర్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు. స్థానిక భీమేశ్వర గార్డెన్‌లో శ్రీధర్‌కు నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ నాయకులు ఉన్నారు.

● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రమ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు మొహమ్మద్ షకీల్, షేక్ ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండెల్లి రాములుగౌడ్‌ను మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామరావు శుక్రవారం ఫోన్‌లో పరామర్శించారు. రాములుగౌడ్ తల్లి లక్ష్మీ గురువారం రాత్రి మరణించగా కేటీఆర్ ఫోన్ చేశారు. అలాగే మాజీ ఏఎంసీ డైరెక్టర్ ముక్క మల్లయ్య కుమారుడు కృష్ణ అనారోగ్యంతో మరణించగా కేటీఆర్ ఫోన్ చేసి విచారం వ్యక్తం చేశారు.

కోనరావుపేట : కోనరావుపేట పోలీస్ స్టేషన్ లో పనిచేసిన ఎస్సై ఆంజనేయులు బదిలీపై వెళుతుండగా శుక్రవారం మాజీ సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. మాజీ సర్పంచులు మల్యాల దేవయ్య, వంశీకృష్ణ రావు, లక్ష్మణ్, పర్శరాములు తదితరులు ఉన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని రైతువేదికలో గ్రామ స్థాయి అధికారులతో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై ఎంపీడీవో నటరాజ్ సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రాధాబాయి పాల్గొన్నారు.

● రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు పాలొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం మల్యాల, జోగాపూర్ పంప్‌హౌస్ నుంచి చందుర్తి మండల కేంద్రం శివారులోని 450 ట్యాంక్‌లోకి శుక్రవారం మోటార్ల ద్వారా నీటిని విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులు గొట్టె ప్రభాకర్, భూమయ్య, పులి సత్తయ్య, రాజయ్య పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్ఠమైనవి



గొల్లపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 2: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండ లంలోని పొత్తూర్, పెద్దలింగాపూర్ గ్రామాలలో శుక్రవారం అవగాహన సమావేశాలు నిర్వహిం చారు. తల్లిపాలల్లో పోషకవిలువలు ఎక్కువగా ఉంటాయని, పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని సూచించారు.

రుద్రంగి: ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారో త్సవాలు నిర్వహించారు. మానసిక, శారీరక ఎదు గుదలకుఅవసరమైన ప్రోటీన్లు అందిస్తాయన్నారు.

కోనరావుపేట: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి అవగాహన కల్పించారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలి



బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న ఐద్వా మహిళలు

సిరిసిల్ల రూరల్, అగస్టు 2 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం నివారించాలని, ఉపాధి కల్పించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరం పద్మ, విమల డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ జెండా చౌరస్తాలో శుక్రవారం అఖిల భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో నేతన్నలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతన్నలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి వీడాలన్నారు. స్పందించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రైతులకు సహకార సంఘాల తోడ్పాటు

వేములవాడ టౌన్, ఆగస్టు 2:రైతుల సంక్షేమం, ఆర్థికా భివృద్ధి కోసం సహకార సంఘాల తోడ్పాటును అందిస్తాయని నాంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని కార్యాలయంలో శుక్రవారం రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలు ఇచ్చేందుకు ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుందన్నారు. డైరెక్టర్లు బొజ్జ భారతి, రవీందర్, నాగరాజు, సత్తయ్య ఉన్నారు.

కట్ట లింగంపేట్‌లో వైద్య శిబిరం

చందుర్తి, ఆగస్టు 2:చందుర్తి మండలం కట్ట లింగంపేటలో చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటా తిరిగి 35 మందికి పరీక్షలు చేశారు. ఇద్దరు జ్వర పీడుతులను గుర్తించా మని మండల వైద్యాధికారి సంపత్ కుమార్ తెలిపారు.

కార్మిక చట్టం అమలుకు పోరాడాలి

వేములవాడ టౌన్, ఆగస్టు 2 : సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలు కోసం భవిష్యత్‌లో బలమైన పోరాటలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ సృజన్ కుమార్ అన్నారు. వేములవాడలో ఈ నెవల 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విలేకర్ల సమావేశం నిర్వహించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకో వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 200 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్, కడారి రాములు ఉన్నారు.

ఉనికి కోసమే బీఆర్ఎస్ నాయకుల ధర్నాలు




సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2: బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉనికి కోసమే ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలు మారుతున్నవారితో ప్రయోజనం లేదన్న సీఎం రేవంత్‌రెడ్డిని అబాసు పాలు చేయడానికి కేటీఆర్ నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారన్నారు. బీఆర్ఎస్‌కు, మాజీ సీఎం కేసీఆర్‌కు మహిళలపై గౌరవం లేదన్నారు. కేసీఆర్ అప్పటి ఎమ్మెల్యే డీకే అరుణను ఒల్లుదగ్గర పెట్టుకో అంటూ సంబోధించడం మహిళలను గౌరవించినట్లా అని ప్రశ్నించారు. గతంలో కేటీఆర్‌ను ఓ మహిళ ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు ఆదుకోవాలని వేడుకుంటే దేశం కోసం కన్నావా నాకోసం కన్నావా అంటూ ఆ మహిళను అవమానించిన కేటీఆర్ మహిళల గౌరవం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వీళ్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలను అవమానించారంటూ ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. మరోసారి సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తే ఊరుకోమన్నారు. మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గం ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఓ బాలికపై అత్యాచారం చేస్తే కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు జరిగిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు స్పందించ లేదన్నారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి చందన, పట్టణ అధ్యక్షురాలు స్వరూపతిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను బీఆర్ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డిపై నిందలు మోపుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ అన్నారు. వేములవాడ పట్టణంలోని గురువారం బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసినదానికి నిరసనగా శుక్రవారం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బింగి మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అతి తక్కువ సమయంలో నెరవేర్చ డంతో బీఆర్ఎస్ జీర్ణించుకోవడంలేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేయలేని పనులను ఆరు నెలల్లోనే చేసి చూపడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వైపు మొగ్గు చూపుతున్నార న్నారు. మహిళా రాష్ట్ర నాయకురాలు పాత సత్యలక్ష్మి నాయ కులు రాజు, చిలుక రమేష్, అజయ్, అన్నారం శ్రీనివాస్, పీర్ మహ్మద్ తదితరులు ఉన్నారు.

తాజా, మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: పెండింగ్ బిల్లులను చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జేఏసీ పిలుపు మేరకు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్ర మానికి తాజా, మాజీ సర్పంచులు వెళ్లకుండా పోలీ సులు అప్రమత్తమయ్యారు. మండలంలోని పలువురు తాజా మాజీ సర్పంచులను శుక్రవారం వేకువజామున ముందస్తు అరెస్ట్ చేశారు. సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే పోలీసులు అదుపులోకి తీసుకోవడం అన్యాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో వెంకటాపూర్, తిమ్మాపూర్, గుండారం తాజా, మాజీ సర్పంచులు కోల అంజమ్మనర్సయ్య, పడి గెల రవీందర్, భూక్య శంకర్‌నాయక్ ఉన్నారు.

వీర్నపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన గ్రామాల అభివృద్ధి, పనుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ పాటి దినకర్ అన్నారు. వీర్నపల్లి మండలం నుంచి హైదరాబా ద్‌లో తలపెట్టిన మాజీ సర్పంచుల ధర్నాకు వెళ్త న్నారని సమాచారంతో పోలీసులు ఆయనతోపాటు మరికొందరు మాజీ సర్పంచులను అరెస్టు చేశారు.

ఇల్లంతకుంట: పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్ బయల్దేరిన మాజీ సర్పంచులను మార్గమధ్యలో శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని సర్పం చులు పేర్కొన్నారు. మాజీ సర్పంచులు చల్ల నారా యణ, అమర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, పర్శరాం, కూనబోయిన బాగ్యలక్ష్మిబాలరాజు, ఎలుక లక్ష్మిస్వామి, సుశీలలింగయ్య తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి : తాజా మాజీ సర్పంచుల జేఏసీ బృందాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తంగళ్లపల్లి మండలంతోపాటు తదితర ప్రాంతాలకు చెందిన తాజా మాజీ సర్పంచ్‌లు శుక్రవారం హైదరాబాద్ తరలి వెళ్లారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు మాట్ల మధుతోపాటు మాజీ సర్పంచుల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, రాష్ట్ర జాక్ వైస్ ప్రెసిడెంట్ మధు సూదన్‌రెడ్డిని హైదరాబాద్‌లో లకిడికపూల్ ద్వారక హోటల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికొం దరిని లిబర్టీ దగ్గర అదుపులోకి తీసుకుని ఫలక్‌నామ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు నాయకులు తెలిపారు.

చందుర్తి: మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య అన్నారు. పోలీసులు అరెస్టు చేయడంతో ఆయన మాట్లాడుతూ బిల్లుల విడుదల కోసం చలో సెక్రెటేరి యట్ చేపట్టడం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదన్నారు.



హైదరాబాద్ వెళ్తున్న సర్పంచులు